
సాక్షి
బాపట్ల
ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 522.80 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 19,012 క్యూసెక్కులు విడుదల చేశారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు శనివారం రూ. 5 లక్షలు విరాళాన్ని అందజేశారు.

స్పందన కార్యక్రమం రద్దు



బాపట్ల అర్బన్: క్రిస్మస్ పండుగ సందర్భంగా సోమవారం స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్టు బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం వెల్లడించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

న్యూస్‌రీల్

సందడిగా బాలోత్సవం



నరసరావుపేట ఈస్ట్: జిల్లాస్థాయి బాలోత్సవం శనివారం పిఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల ఆవరణలో ప్రారంభమైంది. బాలోత్సవ్ పోటీలను ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులలో సృజనాత్మకత పెరిగేందుకు బాలోత్సవం దోహదపడుతుందని తెలిపారు. తరగతి గదిలో చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, కళల పట్ల విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవాలన్నారు. తొలిరోజు పోటీలలో జిల్లా నలుమూలల నుంచి దాదాపు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా తొమ్మిది వేదికలపై సాంస్కృతిక, విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలను నిర్వహించారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో 65 ఈవెంట్లలో పోటీలు నిర్వహించారు. ఆయా పోటీలలో విజేతలైన విద్యార్థులకు ప్రదర్శనల వారీగా ఎప్పటికప్పుడు బహుమతులను అందచేశారు.

అయోధ్య నుంచి అక్షింతలు



రొంపిచర్ల: అయోధ్య నుంచి శ్రీరామ పూజా అక్షింతలు పవిత్ర కలశాలు శనివారం పల్నాడు జిల్లా రొంపిచర్లకు చేరుకున్నాయి. స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో రాష్ట్రీయ స్వయంసేవక్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ రామ పూజా అక్షింతలు మండలంలో అన్ని గ్రామాలకు ఆదివారం పంపిణీ చేస్తామని రాష్ట్రీయ స్వయంసేవక్, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గొడవర్తి వెంకటేశ్వర్లు, పేరేచర్ల కోటేశ్వరరావు, బలరామరాజు, అర్వపల్లి విశ్వేశ్వరరావు, పూజల కొండలు, మొక్కూరి మధుసూదనరావు, పట్టబూరి ప్రభాకర్, పసుమర్తి ఆదినారాయణ, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,000, గరిష్ట ధర రూ.2,800, మోడల్ ధర రూ.2,400 వరకు పలికింది.

దుర్గమ్మకు బంగారు హారం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు కర్ణాటకకు చెందిన భక్తుడు శనివారం బంగారపు హారాన్ని కానుకగా సమర్పించారు. కర్ణాటక కుల్‌కురేకు చెందిన మంజునాథ్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి సుమారు రూ.4 లక్షలతో తయారు చేయించిన 70 గ్రాముల బంగారపు లక్ష్మీహారాన్ని అమ్మవారికి కానుకగా సమర్పించింది. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అందజేశారు.

జమ్మూ కశ్మీర్‌పై మహారాష్ట్ర జట్టు విజయం



మహారాష్ట్ర బౌలర్ డి.ఎ.జోర్

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని ఏసీఏ ఇంటర్నేషనల్ స్టేడియంలో శనివారం జమ్మూ కశ్మీర్, మహారాష్ట్ర జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన మహారాష్ట్ర జట్టు బ్యాటింగ్ ఎన్నుకుంది. రెండవ ఇన్నింగ్స్‌లో జమ్మూ కశ్మీర్ జట్టులో బ్యాట్స్‌మెన్ అసరర్ అజాద్ 19 బంతులకు 37 పరుగులు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మహారాష్ట్ర జట్టులో బౌలర్ డి.ఎ.జోర్ 10 ఓవర్లలో 5 వికెట్లు తీసుకుని, 23 పరుగులు ఇచ్చాడు. మహారాష్ట్ర జట్టుకు 7 పాయింట్లు దక్కగా, జమ్మూ కశ్మీర్ జట్టు 0 పాయింట్లతో సరిపెట్టుకుంది.

అట్టహాసం..సంబరమాశ్చర్యం

❖ గుంటూరులో నంది నాటకోత్సవాలు ప్రారంభం ❖ కళాభిమానులు, విద్యార్థులతో కిక్కిరిసిన ప్రాంగణం

- నాటక రంగ పరిరక్షణ కోసమే నంది నాటకోత్సవం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- వివిధ ప్రాంతాల నుంచి హాజరైన కళాకారులు
- తొలి రోజు నాలుగు పద్య, సాంఘిక నాటక ప్రదర్శనలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర చలనచిత్ర టీవీ నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి, ఎండీ విజయ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పాత గుంటూరు: అంతరించిపోతుందనుకుంటున్న తరుణంలో నాటక రంగ పరిరక్షణ కోసం, నిరుత్సాహంగా ఉన్న కళాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నంది నాటకోత్సవాలు నిర్వహిస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. గుంటూరులోని వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రాష్ట్ర చలనచిత్ర టీవీ నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి ఆధ్వర్యంలో నంది నాటకోత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ కళాకారుడు బలిజేపల్లి లక్ష్మీకాంతం జయంతి సందర్భంగా ఆయన పేరుతో కళా ప్రాంగణంలో ఉత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి మంత్రి చెల్లుబోయిన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభకు సంస్థ ఎండీ టీ.విజయ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ కళాకారుల జీవన ప్రమాణాల పట్ల ప్రభుత్వానికి ఒక ఆశయం, చిత్తశుద్ధి ఉందన్నారు. పేద, మధ్యతరగతి కళాకారుల అభ్యున్నతికి ఈ నంది నాటక ప్రదర్శనలు దోహదపడతాయన్నారు.

టీడీపీ హయాంలో కళాకారులకు అన్యాయం

సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో అర్హత కలిగిన నాటక రంగ సంస్థలు, కళాకారులకు అన్యాయం జరిగిందని అన్నారు. అనర్హులకు నంది అవార్డులు అందించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. సీఎం జగన్ పాలనలో ఏ ఒక్క అనర్హుడికి నంది అవార్డు దక్కదని స్పష్టం చేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా 27 మంది కళాకారులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. సంస్థ ఎండీ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి చెల్లుబోయినకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ కళాకారులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రేక్షకులతో విజ్ఞాన మందిరం ప్రాంగణమంతా కిక్కిరిసింది. విద్యార్థులు, కళాభిమానుల కరతాళ ధ్వనులతో ప్రాంగణం మార్మోగింది. ఆవరణలో ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. కళాకారుల వసతి, మేకప్ సదుపాయాలు, భోజనం ఏర్పాట్లు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

లక్ష్మీకాంతంకు నివాళి

మంత్రితోపాటు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి, డైరెక్టర్ టి.విజయ్‌కుమార్, జేసీ జి.రాజకుమారి, మేయర్ కావటి మనోహర్, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా పాల్గొని మహనీయుడు బలిజేపల్లి లక్ష్మీకాంతం చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు.



శ్రీకాళహస్తీశ్వరం నాటకంలోని సన్నివేశం

ఆకట్టుకున్న ప్రదర్శనలు

తొలిరోజు ప్రదర్శించిన రెండు పద్య నాటకాలు, రెండు సాంఘిక నాటకాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. డాక్టర్ మీగడ రామలింగస్వామి రచనకు, మీగడ మల్లికార్జునస్వామి దర్శకత్వం వహించిన శ్రీ కాళహస్తీశ్వరం పౌరాణిక పద్యనాటకం రసవత్తరంగా సాగింది.

▸ రాజాం కళాసాగర్ నాటక సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు మెట్ట దామోదరరావు నిర్వహణలో ఆకురాతి భాస్కర్ శర్మ రచనా, దర్శకత్వం వహించిన ఎర్ర కాలువ సాంఘిక నాటిక ప్రేక్షకులను ఆలోచింపచేసింది.

▸ తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచన, నాటకీరణలో నాన్నా నేనొచ్చేస్తా సాంఘిక నాటిక, గుంటూరు జిల్లా కొల్లూరు మండలం అనంతవరం శ్రీ దుర్గా భవానీ నాట్యమండలి వారి శ్రీ రామభక్త తులసీదాసు పౌరాణిక నాటకం ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి.

నేటి నాటక ప్రదర్శనలు ఇవే..

- ఉదయం 9:30 గంటలకు విజయవాడ సంస్కార భారతి నిర్వహణలో డాక్టర్ పి.వి. ఎస్ కృష్ణ రచన దర్శకత్వంలో శ్రీ మాధవ వర్మ పద్య నాటకం
- మధ్యాహ్నం 12:30 గంటలకు రాప్తాడు అరబి యూత్ అండ్ కల్చరల్ అసోసియేషన్ నిర్వహణలో ఆముదాల సుబ్రహ్మణ్యం రచనా, దర్శకత్వంలో 'బాధ్యత' బాలల నాటిక
- 2:30 గంటలకు హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ నిర్వహణలో శ్రీ ఆకెళ్ల రచన, బీఎం రెడ్డి దర్శకత్వంలో 'కలనేత' సాంఘిక నాటకం.
- సాయంత్రం 4:30 గంటలకు కరీంనగర్ చైతన్య కళాభారతి నిర్వహణలో వరమాత్మని శివరాం రచన, రమేష్ మంచాల దర్శకత్వంలో 'చీకటి పువ్వు' సాంఘిక నాటిక
- 6 గంటలకు తిరుపతి నందనం అకాడమీ నిర్వహణలో డాక్టర్ పి.వివేక్ రచన, దర్శకత్వంలో 'ఉద్ధం సింగ్' కళాశాల, విశ్వవిద్యాలయాల నాటిక
- రాత్రి 7:30 గంటలకు పొన్నూరు రసరురి నిర్వహణలో ఎల్లాప్రగడ భాస్కర రావు రచన, వై.ఎస్.కృష్ణేశ్వరరావు దర్శకత్వంలో 'త్రిజుడు' సాంఘిక నాటిక.
- 9.00 గంటలకు కొలకలూరు శ్రీసాయి ఆర్ట్స్ నిర్వహణలో రామకృష్ణారావు కథకు, శ్రీ స్నిగ్ధ నాటకీకరణ, గోపరాజు విజయ్ దర్శకత్వంలో 'గమ్య స్థానాల వైపు' నాటిక ప్రదర్శన.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

26న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి గుంటూరుకు రాక



అధికారులతో మాట్లాడుతున్న సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల

గుంటూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూల్లో ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డితో కలసి సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురామ్ శనివారం పరిశీలించారు. వీరి వెంట రాష్ట్ర యువజన సర్వీసులు, పర్యాటక సాంస్కృతికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సి ప్రద్యుమ్న, ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి, నగర పాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, శాప్ మేనేజింగ్ డైరెక్టర్ ధ్యానచంద్ ఉన్నారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడాంశాలకు సంబంధించి ఆట స్థలాలను పూర్తిగా సిద్ధం చేయాలన్నారు. ఆటల పోటీల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అధికారులతో చర్చించి సూచనలు అందించారు. ఏర్పాట్లు, బందోబస్తు, ఇతర సౌకర్యాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ అదనపు ఎస్పీ కే కోటేశ్వరరావు, సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ మహబూబ్ బాషా, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రత్నస్వామి, ఆర్డీఓ పీ శ్రీఖర్, డీఎస్ఓ కోమలి పద్మ, వెస్ట్ తహసీల్దారు సాంబశివరావు, నల్లపాడు సీఐ రాంబాబు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్ పర్యటన ఏర్పాట్లపై స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి శనివారం సమీక్షించారు. జేసీ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకతను అలవర్చుకోవాలి

జిల్లా విద్యా శాఖ అధికారి రామారావు

బాపట్లఅర్బన్: విద్యార్థులు సృజనాత్మకతను అలవర్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె. రామారావు అన్నారు. శనివారం బాపట్ల పురపాలక ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి చెందాలని అన్నారు. కొత్త విషయాలని కనిపెట్టేందుకు విద్యార్థులు ఆసక్తి కలిగి ఉంటారని, ఉపాధ్యాయులు తగిన విధంగా ప్రోత్సాహం అందిస్తే, మంచి పరిశోధకులుగా మారతారన్నారు. గణిత మేళా, విద్యా వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు వేదికగా నిలుస్తాయని, విద్యార్థులు బంగారు కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఎగ్జిబిషన్‌కు మొత్తం 75 ప్రాజెక్టులు వచ్చాయని అన్నారు. కార్యక్రమంలో ఉపవిద్యాధికారులు ఆర్. శ్రీనివాసులు, జి.వెంకటేశ్వర్లు, ఎంఈఓ-2 ప్రసాదరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజశ్రీ, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, సైన్స్ కో ఆర్డినేటర్ భానుచంద్రమూర్తి, ఎ.శ్రీనివాసరావు, సికిందర్, మీర్జాన్ తదితరులు పాల్గొన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో కడపలో జరిగే రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక చేసిన ప్రదర్శనల వివరాలు....



విద్యార్థులతో డీఈఓ రామారావు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన విజేతల వివరాలు

వ్యక్తిగతం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈపూరుపాలెం రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిమ్మాయిపాలెం సెక్యూరిటీ సిస్టం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోధవాడ అండర్ పాస్టన్నల్.

ప్రాబ్లమ్స్ గ్రూప్ క్యాటగిరీ: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గుళ్లపల్లి ఫీచర్ నీడ్స్ టు ఫ్యూచర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొల్లూరు సాయిల్ మాయిశ్చర్ సెన్సార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మేదరమెట్ల మిడ్ డే మీల్ ప్రోగ్రాం.

టీచర్ కేటగిరి: కే పోతురాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈజీ లెర్నింగ్ మ్యాథమెటిక్స్ మోడల్, డి స్వర్ణలత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్ద అంబటిపూడి మ్యాథమెటిక్స్ ఇన్ నాడు-నేడు, ఎస్ఆర్ అండ్ వీఎస్ఆర్ హైస్కూల్ ఇంకొల్లు కళలతో విజ్ఞానం

క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా మంచి వేదిక

- 3-కే రన్ ప్రారంభం
- వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త హనిమిరెడ్డి

అద్దంకి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆడుదాం-ఆంధ్రాకు కార్యక్రమం పల్లెటూరులోని యువతీ, యువకులు, విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుందని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 3-కే రన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హనిమిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువతీ యువకులంతా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి రిజిస్ట్రేషన్ చేసుకుని క్రీడాకారులుగా తమ సత్తాను చూపాలన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తయారు కావాలని పిలుపునిచ్చారు. కమిషనర్ శ్రీనివాసులు, చైర్మన్ ఎల్.ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్లు దేశు పద్మేశ్, కే అనంతలక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కె.రాధాకృష్ణమూర్తి, మండల కన్వీనర్ గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, బీవీకే రెడ్డి, శింగరకొండ దేవస్థాన మాజీ చైర్మన్ కోట శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.



3-కే రన్‌లో పాల్గొన్న సమన్వయకర్త హనిమిరెడ్డి, నాయకులు, అధికారులు

ముక్కోటి..భక్తకోటి



ఉత్తర ద్వార దర్శనంలో శ్రీదేవి భూదేవి సమేత నారసింహుడిని దర్శించుకుంటున్న భక్తులు

- ముక్కోటికి కిటకిటలాడిన మంగళాద్రి
- ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన స్వామి
- రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రాక

తాడేపల్లిరూరల్: నగరంలో వేంచేసియున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి గాంచిన శ్రీదేవి భూదేవి సమేత నారసింహుని ఉత్తర ద్వార దర్శనంలో దర్శించుకున్న భక్తులు భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. శుక్రవారం రాత్రి బంగారు గరుడ వాహనంపై జగన్మోహిని అలంకారంలో గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారి ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలంకరణతో తిరువంజనోత్సవం నిర్వహించుకుని శ్రీదేవి భూదేవి సమేతుడై బంగారు గరుడ వాహనంపై శనివారం తెల్లవారుజామున 3 గంటలకు ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్తర ద్వార దర్శనంలో స్వామి వారిని దర్శించుకున్న భక్తులు బంగారు శంఖుతో తీర్థం స్వీకరించారు. ముక్కోటి సందర్భంగా స్వామివారిని ఉత్తర ద్వార దర్శనంలో పలువురు న్యాయమూర్తులు, రాష్ట్ర సమాచార ప్రసార సినిమాటోగ్రఫీ శాఖమంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు, పలువురు న్యాయవాదులు, అధికారులు దర్శించుకున్నారు.



భక్తులకు బంగారు శంఖుతో తీర్థం

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ యువజన విభాగ అధ్యక్షుల నియామకం

చీరాల: వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుల నియామకాల జాబితాను శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. చీరాల మండల యువజన విభాగం అధ్యక్షుడిగా గవిని కోటేశ్వరరావు, వేటపాలెం మండల అధ్యక్షుడిగా ఆవుల అశోక్, చీరాల క్లస్టర్-1 అధ్యక్షుడిగా బి.జగ్గారావు, క్లస్టర్-2 అధ్యక్షుడిగా కె.రమేష్‌లను నియమించింది.

పర్చూరు నియోజకవర్గం..

పర్చూరు (చినగంజాం): పర్చూరు నియోజక వర్గ పరిధిలోని ఆరు మండలాల్లో యువజన విభాగం అధ్యక్షులను నియమించారు. పర్చూరు మండలానికి ఈదా అంజిరెడ్డి, యద్దనపూడి బొబ్బేపల్లి శ్రీకాంత్, ఇంకొల్లు సయ్యద్ సుభానీ, చినగంజాం సోపర్ల లక్ష్మణరెడ్డి, కారంచేడు గర్నెపూడి సుందరరావు, మార్టూరు గొట్టిపాటి బాబురావులను నియమించారు.

పర్యావరణ సాధనకు మార్పులు రావాలి

చీరాల అర్బన్: సుస్థిర పర్యావరణ సాధనకు సమాజంలో మార్పులు రావాలని ఉస్మానియా యూనివర్సిటీ పర్యావరణ శాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ శశికళ అన్నారు. పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో హరిత సాంకేతికత, పర్యావరణ సుస్థిరత అనే అంశంపై రెండు రోజులు పాటు నిర్వహించిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. రెండో రోజు జరిగిన జాతీయ సదస్సులో శశికళ మాట్లాడుతూ కర్బన ఉద్గారాలు, వాటి దుష్ప్రభావాలు, హరిత గృహ ప్రభావం, కర్బన క్రెడిట్‌లకు మార్గాలు, తీసుకోవాల్సిన చర్యలు, నూతన సాంకేతిక ప్రక్రియలు, పర్యావరణ పరిరక్షణలో యువత పాత్ర అనే అంశాలపై ఆమె సుదీర్ఘంగా ప్రసంగించారు. కోయంబత్తూరుకు చెందిన భారతీయార్ యూనివర్సిటీ బోటనీ ప్రొఫెసర్ డాక్టర్ చిత్ర మాట్లాడుతూ మృత్తిక ఏర్పడే విధానం, మృత్తిక రకాలు, మృత్తిక కాలుష్యం, సారవంతమైన మృత్తికకు ఉపయోగపడే నూతన పర్యావరణ హిత ప్రక్రియలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలానే గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల బోటనీ విభాగాధిపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.సంతోష్‌కుమారి, కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.శ్రీదేవిలు హరిత సాంకేతికత, పర్యావరణ సుస్థిరతపై పరిశోధనా పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ రమణమ్మ, సుధారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహనీయుల జ్ఞాపకాలు మధురం

అద్దంకి: అద్దంకిలో చిన్ని శాంతయ్య పిచ్చమ్మ సేవా సదన్‌లో ఇలపావులూరి సుబ్బారావు కళావేదిక ఆధ్వర్యంలో శనివారం ప్రతిభామూర్తులు మధుర స్మృతులు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి నిమ్మరాజు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో తెలుగు సాహిత్యాభివృద్ధికి విశేష కృషి చేసిన సీపీ బ్రౌన్ గురించి వక్తలు ప్రసంగించారు. గాయకుడు, సినీ నటుడు చిత్తూరు నాగయ్య గురించి చందలూరి నారాయణరావు ప్రసంగించారు. సీపీ బ్రౌన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్ఆవీ రాఘవరావు, గాడేపల్లి దివాకరదత్తు, ఎస్కే ఖాశీం, మోటుపల్లి రామదాసు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరద్వార దర్శనం.. సకలపాప హరణం

- వైభవంగా ముక్కోటి ఏకాదశి
- హరినామస్మరణతో మోగిన వైష్ణవాలయాలు
- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే కరణం, నియోజకవర్గ ఇన్‌చార్జి హనిమిరెడ్డి



ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కరణం బలరాం



అద్దంకి కాకానిపాలెంలో ఉత్తరద్వార దర్శనం చేసుకుంటున్న ఇన్‌చార్జి హనిమిరెడ్డి



కొత్తపాలెం కోదండరామాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చీరాల/వేటపాలెం: పాలసముద్రం మీద తేలియాడే విష్ణుమూర్తిని దర్శించుకునేందుకు ముక్కోటి దేవతలంతా ఈ ఏకాదశి నాడు వైకుంఠాన్ని చేరుకుంటారని ప్రతీతి. అందుకనే ఈ ఏకాదశికి ముక్కోటి ఏకాదశి అనే పేరు వచ్చింది. ముక్కోటి ఏకాదశి వేడుకలు చీరాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. అన్నీ దేవాలయాల్లో ఉత్తర ద్వారా దర్శనాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలోని భావనారుషి స్వామి గుడి, శివాలయం, వేణుగోపాలస్వామి, మదనగోపాలస్వామి, వినాయకస్వామి గుడి, కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానాలు, తదితర దేవాలయాల్లో ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. వేకువ జామునుంచే భక్తులు స్వామి వారి దర్శనాలకు బారులు తీరారు. ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పలు దేవాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చీరాల నియోజకవర్గ ప్రజలు ఆనందంగా, సుఖశాంతులతో జీవించాలని స్వామి వార్లను కోరారు. ఎమ్మెల్యే వెంట వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ చీమకుర్తి బాలకృష్ణ, యుగంధర్, శివ, బ్రహ్మం, సుబ్బారావు, లీలా మోహన్, మాణిక్యరావు, సురేష్, చంద్రశేఖర్, రాంబాబు, శివ తదితరులు ఉన్నారు. పేరాల మదన గోపాలస్వామి గుడిలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

➤ వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేటపాలెంలో వేంకటేశ్వర స్వామిని గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. చెన్నకేశవస్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆణమల్లిపేటలో వేంచేసియున్న రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి దేవస్థానం, పందిళ్లపల్లిలో వేణుగోపాలస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని అనుమంత వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రత్యేక పూజలు చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి హనిమిరెడ్డి..

అద్దంకి రూరల్/బల్లికురవ: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని శనివారం భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ దేవస్థానంలో, అద్దంకి కాకానిపాలెంలోని రంగనాథస్వామి ఆలయం, గ్రామాలోని విష్ణు ఆలయాల్లో ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఈసందర్భంగా అద్దంకి వైఎస్సార్ సీపీ నియోజవర్గ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి స్థానిక రంగనాథస్వామి దేవాలయంలో ఉత్తరద్వారం వద్ద ఏర్పాటు చేసిన స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గర్భాలయంలో పూజలు నిర్వహించారు. దేవస్థాన అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులకు పరిశీలించారు. కార్యక్రమంలో అద్దంకి మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ, వైస్‌చైర్మన్ పద్మేష్, అనంతలక్ష్మీ, మండల కన్వీనర్ గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కాకాని రాధాకృష్ణమూర్తి, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

➤ మహావిష్ణువును ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వారం గుండా దర్శించుకుంటే ఆయురారోగ్యాలతోపాటు అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని బల్లికురవలోని ఆలయ అర్చకులు ఎస్. అనిల్ కుమార్ ఐ సుబ్బాచార్యులు, ఐవీఎస్ఎస్ ఆచార్యులు, పీ సుబ్రమణ్యశర్మ తెలిపారు.

ఆకట్టుకున్న భజనా కార్యక్రమం

ముక్కోటి ఏకాదశి సందర్భంగా పట్టణంలోని కాకానిపాలెంలో వెంకటేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో విచ్చేసిన సాంస్కృతిక కార్యాక్రమాలు ఆహుతలను అలరించాయి. దీనిలో భాగంగా ఈ కార్యక్రమం రంగనాయకస్వామి దేవస్థాన ఆధ్వర్యంలో కాకానిపాలెం వాసులు నిర్వహించారు. గత నెల రోజులుగా పాలెంలోని యువతులు కోలాటాన్ని, యువకులు భజనను నేర్చుకున్నారు. వీరంతా కలిసి శనివారం రాత్రి అడుసుమల్లికి చెందిన నాగేశ్వరరావు పంతులు ఆధ్వర్యంలో ఆహుతులను అలరించే విధంగా భజనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి చూడటానికి, పట్టణంతోపాటు పరిసర గ్రామాల భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

వైకుంఠ ద్వారం నుంచి దేవదేవేరుల దివ్యదర్శనం..

మార్టూరు/కారంచేడు/చినగంజాం/యద్దనపూడి: సూర్యుడు ఉత్తరాయణంలోకి మారే ముందుగా వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి అంటారు. ఈ వైకుంఠ ఏకాదశి నాడు వైకుంఠంలో విష్ణుమూర్తి వైకుంఠద్వారాలు తెరుస్తారని శాస్త్రోక్తి. యద్దనపూడి మండలంలోని పూనూరు వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు దివి భావనాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు దీవి నరసింహచార్యులు, మనోజ్‌లు స్వామివారికి విశేషపూజలు నిర్వహించి ఉత్తరద్వార దర్శనం నిర్వహించారు. యద్దనపూడిలోని వెంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, చింతపల్లిపాడు చెన్నకేశవస్వామి పోలూరు భూలీలా సమేత చెన్నకేశవస్వామి ఆలయాల్లో ఉత్తరద్వారం ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

➤ మండల కేంద్రమైన కారంచేడు పెద బజారు శివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వామివారు ఉత్తరద్వార దర్శనం ఇచ్చారు. గ్రామంలోని కట్టమల్లేశ్వరస్వామి, భూదేవీసమేత గోపాలస్వామి గుడి, వెంకటేశ్వరస్వామి గుడి, స్వర్ణ వెంకటేశ్వరస్వామి గుడి, శివాలయం, వల్లభరాయస్వామివారి దేవాలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.

➤ మార్టూరులోని రుక్మాబాయి సమేత పాండురంగస్వామి ఆలయం, కోలలపూడిలోని కోదండ రామాలయం, ద్రోణాదులలోని రామాలయం తదితర గ్రామాల్లో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మార్టూరు, కోలలపూడి ఆలయాలలో భజన సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు.

➤ ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని చినగంజాం మండల కేంద్రం చినగంజాంలో ఘనంగా నిర్వహించారు. భూ సమేత భావన్నారాయణస్వామి ఆలయంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయం చుట్టూ ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించి ఉత్తర ముఖంగా ఉంచి భక్తులకు దర్శనార్థం ఉంచారు. స్వామి వారికి హారతులు అందజేసి అర్చకులు మోహన లక్ష్మీనరసింహాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దదీ కవనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



కాకానిపాలెంలో చెక్క భజన చేస్తున్న యువకులు



వేటపాలెంలో ఉత్తర ద్వారం వద్ద దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



భావన్నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో దదీ కవనం చేస్తున్న మహిళా భక్తులు



పోలూరులో గరుడవాహనంపై కొలువై ఉన్న చెన్నకేశవస్వామి



కారంచేడులో గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

క్రీస్తు బోధనలు అనుసరణీయం



హనిమిరెడ్డికి దీవెనలు అందజేస్తున్న పాస్టర్లు



మార్టూరులో కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు

సంతమాగులూరు (అద్దంకి రూరల్) : క్రీస్తు బోధనలు అనుసరణీయం అని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి అన్నారు. శనివారం రాత్రి సంతమాగులూరు మండలంలోని గురిజేపల్లి గ్రామంలోని ఎస్సీకాలనీలో కాలనీ వాసులు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. దీనిలో గ్రామంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఏసుక్రీస్తు కృప అందరిపై ఉండాలన్నారు. అనంతరం ఆయనను పాస్టర్లు దీవించారు. కార్యక్రమంలో మండలపార్టీ కన్వీనర్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మార్టూరు: మార్టూరులోని విఘ్నేశ్వర కూరగాయల వర్తకం సంఘం ఆధ్వర్యంలో శనివారం మార్కెట్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్కెట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎస్ఎంబీ బుడే క్రిస్‌మస్ కేక్ కట్ చేసి పంచి పెట్టారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కన్నెగంటి శ్రీనివాసరావు, దారా రామారావు, మైలా నాగేశ్వరరావు, ఆంజనేయులు, కేఆర్ఆర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 3-కే రన్



3-కే రన్ ప్రారంభిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

పర్చూరు(చినగంజాం): ఆడుదాం ఆంధ్రాలో భాగంగా పర్చూరు నియోజకవర్గ స్థాయిలో 3-కే రన్‌ను శనివారం నిర్వహించారు. ఆటల పోటీలో పాల్గొనేందుకు అందరూ సిద్ధం కావాలని పర్చూరు సెంటర్ నుంచి వై జంక్షన్ వరకు నిర్వహించిన రన్‌లో విద్యార్థులు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా వివిధ రకాల ఆటల పోటీలకు 4110 మంది క్రీడాకారులు తమ పేర్లను ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్ తెలిపారు. క్రికెట్ పోటీలకు 1579 మంది, బ్యాడ్మింటన్ ఆటకు 738 మంది, వాలీబాల్ పోటీలకు 904 మంది, కబడ్డీ పోటీకి 630 మంది, ఖోఖో పోటీలకు 884 మంది, ఇతర క్రీడలకు 1805 మంది క్రీడాకారులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు సత్యనారాయణ, వెంకటరామయ్య, హెచ్ఎంలు ఈదర రాజశేఖర్, తేళ్ల వెంకట రాము,ఉపాధ్యాయులు బొజ్జా సురేష్, చింపారెడ్డి, హనుమంతరావు, ఏపీఎం లాజర్, పర్చూరు కార్యదర్శి గౌస్, ఆక్స్‌ఫర్డ్, శారదా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మృతదేహానికి రీ పోస్టుమార్టం

అద్దంకి రూరల్: ఇటీవల వైద్యురాలి నిర్లక్ష్యంతో మృతి చెందిందని ఆరోపణలు వచ్చిన కేసులో మృతదేహానికి రీ పోస్టుమార్టం నిర్వహించారు. అద్దంకి మండలంలోని చెరువుకొమ్ముపాలెం చెందిన మెర్సీరాణి మృతదేహానికి జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం ఆ గ్రామంలో గుంటూరు జీజీహెచ్ వైద్యులు ఎస్సై వెంకటేశ్వర్లు, తహశీల్దార్ జీవి వెంకటరెడ్డి సమక్షంలో మృతదేహాన్ని బయటకు తీసి రీపోస్టుమార్టం నిర్వహించారు. దీనిలో భాగంగా మృతదేహం శాంపిల్స్‌ను వైద్యుల బృందం సేకరించి తీసుకువెళ్లారు. రిపోర్టును ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులతో పాటు మృతురాలి బంధువులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి

మార్టూరు: జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరితో పాటు ఏడు గొర్రెలు మృతి చెందాయి. స్థానికుల వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ద్రోణాదుల గ్రామానికి చెందిన యంపరాల పూర్ణయ్య (27) మార్టూరులో నివాసం ఉంటూ గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఒక కుమార్తె ఒక కుమారుడు ఉన్నారు. పూర్ణయ్య శుక్రవారం అర్ధరాత్రి గొర్రెలను తోలుకొని శనివారం ఉదయం చిలకలూరిపేటలో జరగనున్న సంత కోసం రహదారిపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో తాతపూడి ఫ్లై ఓవర్ సమీపంలో ఓ ఐషర్ లారీ పూర్ణయ్య అతని గొర్రెలను వెనుక నుంచి బలంగా ఢీ కొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ప్రమాదంలో పూర్ణయ్యతో పాటు ఏడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. సమాచారం అందుకున్న చిలకలూరిపేట పోలీసులు పూర్ణయ్య మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి కారణమైన లారీని డ్రైవర్ కోసం దర్యాప్తు చేస్తున్నారు.